క్లుప్తంగా

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

పెంచికల్‌పేట్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని పోతెపల్లి, ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి, లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భద్రయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్ బాబు, మాజీ సర్పంచ్‌లు చంద్రమౌళి, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రమేశ్

కెరమెరి: పాటాగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ రాథోడ్ రమేశ్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో తాగునీరు లేదని, 16 మంది చిన్నారులు ఉన్నప్పటికీ అంగన్‌వాడీ కేంద్రం లేదన్నారు. రెండు రోజుల్లో ప్రత్యేక బృందాన్ని పంపించి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రమేశ్ తెలిపారు.

తాగునీటి ఎద్దటి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ పథకం టీఏ, ఎఫ్‌ఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎక్కడైన తాగునీటి ఇబ్బంది ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి రోజూ 200 కూలీలు ఉపాధి పనులు చేయాలని, రోజూ రూ.300 కూలీ వచ్చేలా పనులు కల్పించాలన్నారు. రాజీవ్ యువ వికాసంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో

ఆసిఫాబాద్‌రూరల్: రాజీవ్ యువ వికాసంకు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు దారులనుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయ న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతి యువకుల ఆర్థికంగా ఎదిగేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవిహార్ బౌద్ధులకు అప్పగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధులు

వాంకిడి: బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయ నగరంలో గల మహా బోద్ధి బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని భిక్కు సంఘం, బీఎస్‌ఐ, అంబేడ్కర్ సంఘం, రమాబాయి మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. బౌద్ధులకు చెందిన బుద్ధగయ బౌద్ధ విహార్‌లో బ్రాహ్మణులు దొంగ చాటున చొరబడి పూజలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అశోక్ మహోల్కర్, ఉప్రె జయరాం, విలాస్ ఖోబ్రగడె, రాజేంద్రప్రసాద్, గంగుబాయి, కమల, బిజ్జుబాయి పాల్గొన్నారు.

రాజీవ్ 'యువ'వికాసం..!



ఈయన పేరు కాంబ్లె చంద్రశేఖర్, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పరంధోళికి చెందిన యువకుడు బీఎస్సీ వరకు చదువుకున్నాడు. ఎలాంటి ఉద్యోగం, ఉపాధి మార్గం దొరకక కూలీ పనులు చేస్తూ.. కాలం గడుపుతున్నాడు. ప్రభుత్వం కల్పించిన రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్నాడు. రుణం మంజూరైతే జనరల్ స్టోర్ షాపు పెట్టి తన కుటుంబాన్ని పోషిస్తానని చెబుతున్నాడు.

- రూ.4 లక్షల వరకు రుణాలు
- రూ.50 వేల వరకు వంద శాతం రాయితీ
- యువత ముందడుగు వేస్తే ఆర్థికాభివృద్ధి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: యువత ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. రూ. 50 వేల నుంచి రూ. 4లక్షల వరకు రుణాల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించి వ్యాపారాల్లో రాణించేందుకు రాయితీని పొందవచ్చు. ఈనెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా 14 వరకు కొనసాగుతోంది. మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు చెందిన 430 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 70 శాతం 35 ఏళ్లలోపు వారే ఉండడం గమనార్హం. రూ.50 వేల కోసం కేవలం ఐదుగురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. కాగా 21 ఏళ్ల నుంచి 55 వరకు సామాన్యులు, రైతులు 21 నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న వాళ్లు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. మండల కేంద్రంలో ఇందు కోసం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం ఇలా..

రూ. 50 వేల వరకు వంద శాతం రాయితీ ఉంటుంది. రూ. 50 వేల నుంచి 1లక్ష వరకు 90 శాతం రాయితీ, రూ.1–2 లక్షల వరకు 80 శాతం రూ.2–4 లక్షల వరకు 70 శాతం రాయితీపై రుణాలు పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 వరకు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2లక్షల వరకు ఆదాయం పొంది ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. కాగా రూ.50 వేల వరకు ప్రభుత్వమే వంద శాతం రాయితీపై రుణాలు నేరుగా మంజూరు చేయనుండగా.. రూ.50 తర్వాత బ్యాంకుల ద్వారా అందించనున్నారు.

నిరుద్యోగ యవతకు వరం..

రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంలా మారనుంది. చిన్న వ్యాపారాల నుంచి పెద్ద వ్యాపారాల వరకు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వ్యవసాయం పశుపోషణ వంటివి కాకుండా, టిఫిన్ సెంటర్ నుంచి మెకానిక్ షాపు, కూల్‌డ్రింక్, కూలర్ల బిజినెస్, ఆటోమోబైల్ షాపు, మినీ సూపర్ బజార్, తదితర యూనిట్లు ఏర్పాట్లు చేసుకోవచ్చు. అయితే కులాల వారీగా స్కీములను కేటాయించారు. ఎస్టీలకు 83 రకాల స్కీములు ఉండగా.. ఎస్సీలకు 117, బీసీలకు 194, ఎంబీసీలకు 196, మైనార్టీలకు 159, క్రిష్టియన్‌లకు 170 రకాల స్కీముల యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యోగం లేదని బెంగపడుతున్న యువతకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట వివిధ రకాల రుణాలను అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తుంది. యువకులతో పాటు పెద్దలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రూ. 50 వేల వరకు ప్రభుత్వమే పూర్తి రాయితీతో రుణం అందించనుంది.

– అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

రేషన్ షాప్‌లకు చేరని సన్నబియ్యం

- మండలంలో 17 రేషన్ దుకాణాలు
- ఐదు షాపులకు మాత్రమే చేరిన బియ్యం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో (ఫైల్)

దహెగాం: నిరుపేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1 నుంచి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. కానీ మండలంలో పూర్తి స్థాయిలో రేషన్ దుకాణాలకు సన్నబియ్యం చేరలేదు. దీంతో గురువారం సన్నబియ్యం పంపిణీ జరగ లేదు. దీంతో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు సన్నబియ్యం కోసం ఎదురు చూస్తున్నారు.

మండలంలో 17 రేషన్ దుకాణాలు..

మండల వ్యాప్తంగా 17 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 17 రేషన్ దుకాణాల్లో ప్రతీ నెల లబ్ధిదారులకు 1758 క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతుంది. ఈనెల 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. అట్టహాసంగా సన్న బియ్యం పంపిణీ కొనసాగుతోంది. మండలంలో బుధవారం మాత్రమే మూడు రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అధికారులు బియ్యం పంపిణీ చేశారు. మిగతా చోట్ల పంపిణీ జరగలేదు. గురువారం మండలంలో పంపిణీ జరగలేదు. దుకాణాలకు పూర్తి స్థాయిలో సన్నబియ్యం చేరుకోలేదని పలువురు వాపోతున్నారు.

8,195 రేషన్ కార్డులు..

మండలంలో 8195 రేషన్ కార్డులు ఉండగా 17 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఏఎఫ్‌ఎస్‌సీ కార్డులు 1344, ఎఫ్‌ఎస్‌సీ కార్డులు 6,851 ఉన్నాయి. మొత్తం 9,195 కార్డులు ఉండగా ప్రతీ నెల 1,758 క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతుందని అధికా రులు తెలిపారు. సన్నబియ్యం మండలంలోని కోత్మీర్, బొర్లకుంట, ఇట్యాల గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో బుధవారం పంపిణీ ప్రారంభించారు. అదే విధంగా కుంచవెల్లిలోని రెండు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం వచ్చినప్పటికీ ఆన్‌లైన్ కాక పోవడంతో పంపిణీ చేయలేదు. మిగతా 12 రేషన్ దుకా ణాలకు ఇంకా బియ్యం చేరలేదు. దీంతో లబ్ధిదారులు సన్న బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ఇ ప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం సరఫరా చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాడుతాం



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పోరాడుతామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వంకులం, నవేగాం, రాంపూర్, కైరిగాం, కొండపల్లి గ్రామాల్లో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహించారు. వంకులంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ఎన్నటికీ మర్చిపోలేనిదన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పోరాటం చేసేందుకు సిద్ధం ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లావుడ్య రమేశ్, జువ్వాజీ అనిల్‌గౌడ్, దుర్గం దేవాజీ, వేముర్ల సంతోష్, దుర్గం సోమయ్య, సుదర్శన్‌గౌడ్, కార్తీక్, ప్రేందాస్, ఆత్మారాం, సోమశేఖర్, కొవ్వూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైబాపు.. జైభీం అవగాహన ర్యాలీ

ఆసిఫాబాద్‌రూరల్: జైబాపు.. జై భీం.. జై సంవిధన్ పాదయాత్రలో భాగంగా గురువారం మండలంలోని సాలేగూడ, అడ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై బాపు.. జై భీం.. జై సంవిధన్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలేశ్వర్ గౌడ్, మల్లేష్, శివరాం, శివప్రసాద్, కిరణ్, మనోహర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్చే కుట్రను సహించం

కెరమెరి: రాజ్యాంగాన్ని మార్చే కుట్రను సహించమని కాంగ్రెస్ కమిటీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కొఠారి, రింగన్‌ఘాట్, గోయగాం, ధనోరా, పార్ధ, సుర్దాపూర్, ఝరి, మోడి గ్రామ పంచాయతీల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, ఆత్రం లక్ష్మణ్, లింబారావు, న్యానేశ్వర్, నగేవ్, రాజు, శంకర్, హన్మంతు, బుచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓంకార ఆశ్రమంలో నేటి నుంచి ఉత్సవాలు

- 4, 5న వార్షికోత్సవ వేడుకలు
- 6న రామనవమి ఉత్సవాలు
- హాజరు కానున్న ఆధ్యాత్మిక ప్రముఖులు



శ్రీరాధాకృష్ణుల విగ్రహ మూర్తులు

చింతలమానెపల్లి: ఆధ్యాత్మికం మనిషికి ప్రశాంతత నిస్తుంది. దుర్మార్గానికి దూరం చేస్తూ సన్మార్గానికి మార్గం చూపిస్తుంది. భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రవచనాలను బోధిస్తూ ఖర్జెల్లి ఓంకార ఆశ్రమం దినదినం ఆధ్యాత్మిక అభివృద్ధి చెందుతోంది.

ఆలయంలో భక్తి కార్యక్రమాలు..

ఈనెల 4 శుక్రవారం నుంచి ఆలయంలో భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 4, 5 తేదీలలో వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నాను. 6న శ్రీరామ నవమి వేడుకలు ఆశ్రమంలో నిర్వహించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా కౌటాల మండల కేంద్రం నుంచి శ్రీసీతారాములకు పట్టువస్త్రాలను శోభాయాత్రతో తీసుకువస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 4న ప్రణవ పతాక ఆవిష్కరణ, 9.30 గంటలకు గీతాపారాయణం, సాయంత్రం లలిత సహస్రనామ పారాయణం, 5న 6గంటలకు నిత్యపూజ, 10 గంటల నుంచి యజ్ఞం, సాయంత్రం 5గంటలకు సామూహిక హారతి, పూజా కార్యక్రమాలు, 7గంటల నుంచి సంస్కృతిక కార్యక్రమాలు, 6న శ్రీరామనవమి ఉదయం 8 గంటలకు నగర సంకీర్తన, శ్రీసీతారాముల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రముఖులు ప్రవచనాలు..

ఉత్సవాలలో భాగంగా నిర్వహించే భక్తి కార్యక్రమాలకు ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు హాజరై భక్తి ప్రవచనాలు బోధించనున్నారు. మళయాల సద్గురు సన్యాస మఠం కరీంనగర్ నుంచి విష్ణుసేవానంద గిరి స్వామి, కోరుట్ల జగదీశ్వర మఠం నుంచి జగదీశ్వరనంద స్వామి, జగద్గురు గీతా ఆశ్రమం తొర్రూర్ నుంచి జ్ఞాన చైతన్యానంద స్వామి, ఆసిఫాబాద్ నరనారాయణ ఆశ్రమం నుంచి నారాయణానంద స్వామి, రాజేశం గురువు మంచిర్యాల, శ్రీరాధాక్రిష్ణ తపోవన ఆశ్రమం బృందావన్ గురువు శ్రీశివరామ క్రిష్ణ స్వామిలు భక్తులు ఉత్సవాలను నిర్వహించే రోజుల్లో సద్బోధ, ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించనున్నారు.

భక్తుల మన్ననలు పొందుతూ..

ఖర్జెల్లిలోని ఓంకార ఆశ్రమానికి 2007లో అంకురార్పణ చేశారు. కరీంనగర్ జిల్లా గాగిల్లాపూర్ ఆశ్రమ గురువు ప్రేమ స్వరూపానందగిరి స్వామి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన అనంతరం శ్రీశివరామక్రిష్ణ స్వామి, భక్త బృందం ఆధ్వర్యంలో ఆశ్రమంలో రాధాక్రిష్ణుల ఆలయం, ఇతర వసతులను ఏర్పాటు చేశారు. గత ఏడాది ఏప్రిల్ 4న రాధాక్రిష్ణుల విగ్రహాలను ప్రతిష్ఠించి కార్యక్రమాలను నిర్వహించారు.

మహంకాళి జాతర ఏర్పాట్లు షురూ



ఆలయ పరిసరాల్లో మొరం పోయిస్తున్న సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంతకాళి అమ్మవారి ఆలయంలో ఈ నెల 12 నుంచి నిర్వహించే జాతర ఏ ర్పాట్లు మొదలయ్యాయి. గురువారం ఆలయ కమి టీ సభ్యులు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామన్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బియ్యం పంపిణీ చేయాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



బియ్యం పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కౌటాల: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పకడ్బందీగా పంపిణీ చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. కౌటాల మండలం తలోడి రేషన్ షాపులో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, వ్యవసాయాధికారి ప్రేమలత, కార్యదర్శి కవిత, డీలర్ బికారు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

బెజ్జూర్: చలో హెచ్‌సీయూ కార్యక్రమంలో భాగంగా ఏబీవీపీ పూర్వ నాయకులను గురువారం ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు అరెస్టు చేశారు. బెజ్జూర్ మండల కేంద్రంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమ్మెర బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హెచ్‌సీయూ 420 ఎకరాల భూమిని కాపాడేందుకు తరలివెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా ఆక్రమించిన 420 ఎకరాల హెచ్‌సీయూ భూముల విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఏబీవీపీ పూర్వ వనవాసి జిల్లా కన్వీనర్ పోల్క వెంకటేశ్, కౌటల బాగ్ కన్వీనర్ అవదుత సాయిలు ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

వాంకిడి: చలో హెచ్‌సీయూ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడం సరికాదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ శక్తులకు అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు.

ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని బౌద్ధ గురువు భంతే భరద్వాజ్, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో గురువారం ఛత్రపతి శివాజీ వర్ధంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ హైందవ రాజ్య స్థాపన, మరాఠా సామ్రాజ్యం విస్తరణ కోసం శివాజీ వీరోచిత పోరాటం సాగించారన్నారు. అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆరె సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం, అంబేడ్కర్ సంఘం నాయకులు ఉప్రె జైరాం, దుర్గం హంసరాజ్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, ఉప్రె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూర్: బీజేపీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దొడ్డి కొమురయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఉమ్మెర బాల కృష్ణ, ఎర్రయ్య, మెస్తం రాజారాం, రాకేశ్, మెరుగు గంగ, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో దొడ్డి కొమురయ్య జయంతిని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటం రావడానికి, భూమి, భుక్తి, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రధాన కారణమన్నారు. నాయకులు ఎనగంటి ప్రవీణ్ యాదవ్, దేనవేణి గొల్ల, రమేశ్, శంకర్, కార్తీక్, దేవన్న, ఆనంద్ రావు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపిక

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామానికి చెందిన జునుగురి వంశీకృష్ణ అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. దేశ సైన్యంలోకి వంశీయకృష్ణ ఎంపిక కావడంతో గురువారం పలువురు ఆయన అభినందించారు.

డబుల్ రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



దహెగాం: మండల కేంద్రం నుంచి కోత్మీర్ గ్రామం వరకు ఏడాదిన్నర క్రితం డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి సుమారు రూ.32 కోట్లు మంజూరయ్యాయి. అయితే నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంపై గురువారం 'సాక్షి'లో 'డబుల్ రోడ్డుకు గ్రహణం..!' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు గురువారం డబుల్ రోడ్డు పనులు ప్రారంభించారు. ముందుగా కల్వర్టుల నిర్మాణం కోసం జేసీబీతో గుంతలు తీశారు. ఎట్టకేలకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న సన్న బియ్యం పంపిణీ



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి, ధనోరా, బాబేఝరి, పాట్నాపూర్ గ్రామాల్లో సన్న బియ్యం కార్యక్రమాన్ని తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు కూడా సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు.

రెబ్బెన: రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం నిరుపేదల కోసం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకరమ్మ అన్నారు. గురువారం గంగాపూర్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సౌమ్య, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, వినోద్‌కుమార్, దత్తేశ్వర్, రాంచందర్, డీలర్ శంకర్ పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. తడిసిన మిర్చి



గుండాయిపేట్‌లో పంటను కుప్ప చేస్తున్న రైతులు

కౌటాల: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తాటిపల్లి, గుండాయిపేట, మొగడ్‌దగడ్, వీర్దండి గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట తడిసింది. గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్న రైతులను అకాల వర్షం దెబ్బతీస్తోంది. కవర్లు కప్పడానికి చేలకు పరుగులు తీశారు. అలాగే పలుచోట్ల మొక్కజొన్న పంట సైతం తడిసింది.